



అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపులో జగ్గారెడ్డి

- సదాశివపేట అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు
- స్వాములతో కలిసి పేటైతుల్లి నృత్యాలు చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఆభరణాల ఊరేగింపులో పాల్గొన్న జగ్గారెడ్డి

సదాశివపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు ఉత్సవాలను అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. శబరిమల క్షేత్రంలో నిర్వహించే అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు ఉత్సవాల తరహాలో ప్రతీ ఏడాది మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. పట్టణంలోని సంగమేశ్వర మందిరం నుంచి ప్రారంభమైన అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు పురవీధుల గుండా నేత్రపర్వంగా సాగింది. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం రథంతో పాటు అయ్యప్ప స్వామి స్వర్ణ, వజ్రాభరణాల పెట్టెలను 108 రోజులు దీక్షలు చేసిన అయ్యప్ప స్వాములు నెత్తిన పెట్టుకుని పేటైతుల్లి, కోలాటం ఆటలతో.. భజన సంకీర్తనలతో ఊరేగించారు. ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములతో కలిసి జగ్గారెడ్డి పేటైతుల్లి నృత్యాలు చేశారు. జగ్గారెడ్డితో కరచలనం చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. జగ్గారెడ్డి వారికి అభివాదం చేస్తూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు పరిసర గ్రామాలతో పాటు సంగారెడ్డి, జహీరాబాద్, రంగారెడ్డి జిల్లా నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు.





బస్టాండ్ కిటకిట

సంక్రాంతి సెలవులకు వచ్చిన నగరవాసులు తిరుగు ప్రయాణం పట్టారు. సిద్దిపేట అంబేడ్కర్ సర్కిల్ వద్ద బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్సుల్లో సీటు కోసం ప్రమాదకరంగా పరుగెత్తుతూ కిటకీల నుంచి దూరి మరి సీటు సంపాదించటం కోసం పాట్లు పడ్డారు. కొంతమంది చిన్నారులు సంక్రాంతికి కొనుకున్న గాలిపటాలను కూడా తమ వెంట తీసుకెళ్లడం కనిపించింది.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి)

శత సహస్ర సూర్య నమస్కారాల యోగా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : శత సహస్ర సూర్య నమస్కారాల యోగా ప్రదర్శన, రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీల పోస్టర్‌ను కలెక్టర్ మనుచౌదరి గురువారం ఆవిష్కరించారు. సిద్దిపేట బాలికల ఉన్నత పాఠశాల మినీ స్టేడియంలో ఫిబ్రవరి 9న ఉదయం 6 గంటలకు యోగా సాధకుల లక్ష సూర్య నమస్కారాల ప్రదర్శన ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఈ ప్రదర్శనను ప్రత్యక్షంగా వీక్షించి నమోదు చేస్తారని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 63022 27030, 90001 90589 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రదర్శనలో కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట ఆశోక్, ఉపాధ్యాక్షుడు కోమాండ్ల విక్రమ్‌రెడ్డి, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా లక్ష్మీకాంత్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా కలెక్టరేట్‌లోని కార్యాలయంలో లక్ష్మీకాంత్‌రెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఆయన హనుమకొండ జిల్లాలోని జిల్లా సంక్షేమ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసి పదోన్నతి మీద జిల్లాకు విచ్చేశారు. ఇంతకుముందు డీడబ్ల్యూవో (పూర్తి అదనపు బాధ్యతలు)గా విధులు నిర్వహించిన శారదా సిద్దిపేట సీడీపీవోగా బాధ్యతలు చేపట్టారు.

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా.. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై వడపోతలు జరుగుతున్నాయి. ఈనెల 26 నుంచే నాలుగు పథకాలను అమల్లోకి తీసుకొస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగ మంతా క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపులో నిమగ్నమయ్యారు. తుది జాబితాపై తర్జనభర్జన పడుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రారంభమైన సర్వే ఈనెల 20 దాకా కొనసాగనున్నది. 21వ తేదీ నుంచి నిర్వహించే గ్రామసభల్లో అర్హుల పేర్లను ప్రకటించనున్నారు.



జగదేవ్‌పూర్ మండలంలో సాగు చేయని భూములను సర్వే చేస్తున్న తహసీల్దార్, ఏవో

వడపోత



- ముమ్మరంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల సర్వే
- సాగుకు యోగ్యంకాని భూములపై విచారణ
- గందరగోళంగా రేషన్‌కార్డుల జాబితా
- వ్యవసాయ కూలీల సంఖ్యపైనా తర్జనభర్జన
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై దృష్టి
- సిద్దిపేట జిల్లాలో 136 బృందాలతో సర్వే
- గ్రామసభల్లోనే తేలనున్న అర్హుల లెక్క

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 16 : ఒక్క సర్వేతో నాలుగు పథకాలకు అర్హులను ఎంపిక చేసే పనిలో జిల్లాల అధికారులు నిమగ్నమయ్యారు. మూడు రోజుల పండుగ సెలవుల అనంతరం అధికారులంతా క్షేత్రస్థాయిలోని భూములు, ఇళ్లబాట పట్టారు. అన్ని శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 136 బృందాల ద్వారా సర్వే ప్రారంభించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి గడువులోగా సర్వేను పూర్తిచేయించేలా చర్యలు చేపట్టారు.

గుట్టలు, వెంచర్లపై విచారణ

రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సహాయం అందించే విధంగా ప్రభుత్వం యోచిస్తున్నది. గత ప్రభుత్వంలో అన్ని రకాల భూములకు పెట్టుబడి పేరిట రైతుబంధు డబ్బు ఇవ్వగా, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం సాగుకు యోగ్యమయ్యే భూములకు మాత్రమే రైతు భరోసా అందిస్తామని ప్రకటించి ఆ దిశగా అడుగులు వేస్తోంది. అధికారుల ద్వారా సాగుకు యోగ్యం కాని భూముల లెక్కలను తేలుస్తున్నారు. గుట్టలు, రాళ్లరప్పల భూముల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లలో నమోదైన భూములను వ్యవసాయ భూముల జాబితా నుంచి తొలగిస్తున్నారు. కాల్వలు, రిజర్వాయర్లలో మునిగిన భూములను గుర్తిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 7.10 లక్షల ఎకరాల భూవిస్తీర్ణం

మిగతా 8వ పేజీలో

మూడురోజులుగా రోడ్డు పక్కన వృద్ధురాలు.. ఇంటికి చేర్చిన పోలీసులు

హుస్నాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొడుకు కొట్టాడని ఇంటి నుంచి వచ్చి మూడు రోజులుగా రోడ్డుపై ఉన్న ఓ వృద్ధురాలిని హుస్నాబాద్ పోలీసులు తిరిగి ఇంటికి చేర్చి శబాష్ అనిపించుకున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం బొల్లొనిపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ కొమురవ్వ(70) పట్టణంలోని గాంధీచౌరస్తా వద్ద మూడు రోజులుగా తిండి లేక నీరసంగా పడి ఉంటుంది. ఆమెను చూసిన కౌన్సిలర్ గూళ్ల రాజు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. హెడ్ కానిస్టేబుల్ మొగిలినాయక్, కానిస్టేబుల్ దూద్యనాయక్ నాయక్ వచ్చి ఆమెతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన కొడుకు చేయి చేసుకోవడంతో అలిగి ఇల్లు వదిలి వచ్చానని చెప్పగా, వారు సొంత డబ్బుతో ఆటోలో ఇంటికి పంపించారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న పోలీసులు

సిద్దిపేట అధ్యాపకుడికి జాతీయస్థాయి గుర్తింపు




సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ సందాని

సిద్దిపేట కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలోని హెబిటెట్ సెంటర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి విద్యా సదస్సులో జిల్లాకు చెందిన ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ సందాని పాల్గొన్నారు. నేషనల్ స్కూల్ లీడర్‌షిప్ 2024-25, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల జాతీయస్థాయి విద్యా సదస్సులో సయ్యద్ సందాని తన ప్రజెంటేషన్‌ను ప్రదర్శించారు. సయ్యద్ సందాని వినూత్న బోధన పద్ధతులు బాగున్నాయని పలువురు కితాబిచ్చారు.

'కోస్టా యాప్ కుచ్చుటోపి'.. కలకలం

విచారణకు ఆదేశించిన సీపీ



వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్

చేర్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోస్టా యాప్ ద్వారా కుచ్చుటోపి పెట్టిన విషయం చేర్యాల ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. వందలాదిమంది యాప్‌లో డబ్బులు పెట్టుబడి పెట్టగా, ఆసరా చేసుకున్న నిర్వహకులు బిచాణా ఎత్తేసిన విషయమై ఆంధ్రజ్యోతిలో గురువారం 'కోస్టాట్ యాప్‌తో కోట్లు హాంఫట్' శీర్షికన ప్రచురితమైన విషయం తెలిసిందే. కొద్దిరోజులుగా జరుగుతున్న ప్రచారం మేరకు యాప్‌లో డబ్బు పెట్టేందుకు సన్నద్ధమైన పలువురు అప్రమత్తమయ్యారు. ఈ ప్రయత్నాన్ని ఉపసంహరించుకున్నట్లు పలువురు తెలిపారు. ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన సిద్దిపేట సీపీ అనురాధ విచారణకు ఆదేశించారు. దీంతో చేర్యాల పోలీసులు పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించి పలువురు బాధితులను కలిసి ఆరా తీశారు. ఏం చెబితే ఏం జరుగుతుందోనన్న భయంతో ఎవరూ సరైన వివరాలు తెలపకపోగా, ఫిర్యాదు అందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఇంటెలిజెన్స్ పోలీసులు కూడా ఆరా తీసినట్లు తెలిసింది. నిన్న, మొన్నటివరకు యాప్ వాట్సప్ గ్రూప్‌లో సభ్యులు తమ సందేహాలు, ఇతరత్రా వివరాలు తెలుసుకునే అవకాశం ఇచ్చిన నిర్వహకులు, అడ్మిన్ మినహా ఇతరులెవరూ పోస్టింగ్ చేయకుండా గురువారం లాక్ చేశారు. అంతేకాకుండా మరో రూ.3వేలు చెల్లిస్తే రోజుకు అత్యధికంగా రూ.3వేలు చొప్పున పొందవచ్చని, 24 గంటల్లో జమ అవుతాయని సూచించారు.

లాభాలకు ఆశపడి.. యాప్‌లో పెట్టుబడి | 7లో

బొట్టు, బోనం, సిగం, పట్నం వంటి ఎన్నో విశిష్టతల ఆలవాలం.. భక్తుల కొంగు బంగారం.. తెలంగాణ జానపద సాంస్కృతిక చిహ్నం.. కొండ సొరికెలలో వెలసిన కోర మీసాల కొమురెల్లి మల్లన్న ఆలయం. బండారి దేవుడి క్షేత్రంలో మూడు నెలల మహాజాతరకు అంతా సిద్ధమైంది. సత్తేటి వారాల పూజలకు ఈ ఆదివారం అంకురార్పణ జరగనున్నది. ఒగ్గుల పూజలు.. జగ్గుల మోతలు.. డప్పుచప్పుళ్ల దరువులు.. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలతో మల్లన్న ఆలయం సిగాలూగనున్నది.

వారవారమూ... మల్లన్నా

ఒగ్గుల పూజలు జగ్గుల మోతలు

మార్మోగనున్న కొమురెల్లి మల్లన్న క్షేత్రం

- సత్తేటి వారాల మహా జాతరకు వేళాయే
- మూడు నెలల పాటు సిగమూగనున్న కొమురెల్లి
- ఈనెల 19 నుంచి ప్రారంభం
- మార్చి 23న అగ్నిగుండాలతో సమాప్తం



గతేడాది పట్నవారం సందర్భంగా రాజగోపుర ఆవరణలో హైదరాబాద్ భక్తుల రద్దీ



గర్భాలయంలోని మల్లన్నస్వామి

చేర్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఏ ఆలయంలోనైనా బ్రహ్మోత్సవాలు మూడు, ఐదు, వారం లేదా తొమ్మిది రోజులపాటు జరుగుతాయి. కానీ కొమురవెల్లి మల్లన్న ఆలయంలో మాత్రం మార్గశిర మాసం చివరి ఆదివారం ప్రారంభమై పాల్గుణమాసం చివరి ఆదివారం వరకు మూడు నెలలపాటు సాగుతాయి. ఇటీవలే మల్లన్న కల్యాణం జరగగా.. ఈనెల 19వ తేదీ నుంచి ప్రతీ ఆదివారమూ జాతర కొనసాగనున్నది. సంక్రాంతి తరువాత వచ్చే మొదటి ఆదివారం రోజున పట్నం భక్తులు భారీగా తరలివచ్చి పట్నాలు వేసి బోనాలు నివేదించి పండుగ జరుపుతారు. దీన్ని పట్నంవారంగా పిలుస్తారు. రెండో వారం సికింద్రాబాద్ భక్తులు రావడంతో లష్కర్‌వారంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. గతంలో కేవలం మూడునెలల కాలంలో ఏడు ఆదివారాల పాటు జాతర కొనసాగడంతో సత్తేటి వారాల జాతరగా పేరొందింది. కానీ తిథుల ఆధారంగా ఒక్కోసారి 9-14 వారాల వరకు

మిగతా 7వ పేజీలో

బ్రహ్మోత్సవ పూజలు

ఫిబ్రవరి 26న మహాశివరాత్రి.. లింగోద్భవ సమయంలో ఏకాదశ రుద్రాభిషేకం, స్వామివారి సేవ, ఊరేగింపు, పెద్దపట్నం నిర్వహించనున్నారు. 27న ఏకాదశ రుద్రాభిషేకం, అన్నపూజ, మార్చి 12న కామదహనం, 14న వసంతోత్సవం (హోళీ వేడుకలు), 23న వీరభద్ర ప్రస్తాయం, భద్రకాళి పూజ, అగ్నిగుండ ప్రజ్వలన, తెల్లవారుజామున గురుపూజ, బలిహరణ, అగ్నిగుండ ప్రవేశం, విజయోత్సవం, మహదాశీర్వచనం.

మహాజాతర వారాలు(సత్తేటి వారాలు)

జనవరి 19 మొదటి వారం (పట్నంవారం), జనవరి 26 రెండోవారం (లష్కర్‌వారం), ఫిబ్రవరి 2 మూడోవారం, ఫిబ్రవరి 9 నాలుగోవారం, ఫిబ్రవరి 16 ఐదోవారం, ఫిబ్రవరి 23 ఆరోవారం, మార్చి 2 ఏడోవారం, మార్చి 9 ఎనిమిదో వారం, మార్చి 16 తొమ్మిదో వారం, మార్చి 23 పదో వారం (అగ్నిగుండాలతో సమాప్తం)

నవోదయ ప్రవేశ పరీక్షకు 30 కేంద్రాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,465 మంది విద్యార్థులు

సిద్దిపేట జిల్లాలో 2,250 మంది.. 10 కేంద్రాలు

రేపు ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహణ

7

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్‌కుమార్

8

కొండపోచమ్మ జాతరకు భారీ బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

మల్లన్న హుండీ లెక్కింపు

33 రోజుల్లో రూ.73,14,488 ఆదాయం

134గ్రాముల మిశ్రమ బంగారం, 9.300కిలోల మిశ్రమ వెండి

ఐదేళ్లుగా హుండీలోనే సంచి.. ఎందుకు దాచారని అనుమానాలు

7

దుర్గమ్మ సేవలో అదనపు ఎస్పీ



దుర్గమ్మను దర్శించుకుంటున్న అదనపు ఎస్పీ మహేందర్

పాపన్నపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవానీ మాతను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన వనదుర్గ భవానీ మాతను దర్శించుకొని ప్రత్యేక అర్చన పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ప్రతాప్‌రెడ్డి శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

హైకోర్టు ప్రమేయంతో రైతుల భూముల్లో సర్వే



రైతుల భూముల్లో సర్వే చేస్తున్న భూకొలతల సిబ్బంది

కొండాపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొన్నేళ్ల నుంచి వ్యవసాయ సాగు భూముల్లోకి వెళ్లకుండా ఓ ప్రైవేట్ యాజమాన్యం చుట్టూ ఫెన్సింగ్ వేసి, బౌన్సర్లతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. గతేడాది అక్టోబరు 15, 2023న హైకోర్టు రైతుల సమక్షంలో సర్వేను జరిపించాలని ఆదేశించింది. దీంతో గురువారం ఆర్డీవో పర్యవేక్షణలో సర్వే జరిపించారు. గతంలో జరిపిన సర్వేలను తమకు అనుకూలంగా మలుచుకుని ప్రైవేట్ యాజమాన్యం తమపై అక్రమంగా బైండోవర్ కేసులు పెట్టించిందని రైతులు ఆరోపించారు. ఇతరుల ప్రమేయం లేకుండా హైకోర్టు ఆదేశాల ప్రకారం సర్వేను నిర్వహించి, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

ఘనంగా రామలింగేశ్వరుడి రథోత్సవం

తూప్రాన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్పగుట్టపై వెలసిన స్వయంభూ శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి జాతర గురువారం రథోత్సవంతో ముగిసింది. ఉదయం భవానీ రామలింగేశ్వరస్వామిని అందంగా అలంకరించిన రథంపైకి చేర్చి ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ పూజారి శలాక ఆత్రేయశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే జైలుకే..



అవగాహన కలిగిస్తున్న సీఐ పవన్

రామచంద్రాపురం టౌన్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నామని ట్రాఫిక్ విభాగం రామచంద్రాపురం సీఐ పవన్ హెచ్చరించారు. గురువారం తెల్లాపూర్ శివారులో రోడ్డు భద్రతా మాసోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణం చేసే సమయంలో భద్రతాపరమైన చర్యలు తీసుకోకపోతే కుటుంబసభ్యులు అన్యాయానికి గురవుతున్నారని వివరించారు. అందువల్లే ప్రభుత్వం కఠినమైన నిబంధనలు అమలు చేస్తోందని చెప్పారు.

'బహిరంగ సభను విజయవంతం చేయాలి'

కొండాపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో 25న జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి రాజయ్య పిలుపునిచ్చారు. గురువారం తేర్పోల్ గ్రామంలో బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈ మహాసభలకు కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నట్లు వెల్లడించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాబురావు, ప్రశాంత్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్వార్లతో దాడులకు పాల్పడిన ఏడుగురి అరెస్టు

తూప్రాన్, జనవరి (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ కేశవనగర్‌లో సంక్రాంతి పండుగ రోజున పతంగుల దుకాణంపై తల్వార్లు, కర్రలతో దాడులు చేసి యజమాని తుమ్మల గణేశ్‌పై దాడికి చేసి, దుకాణాన్ని ధ్వంసం చేసిన ఏడుగురు సిక్కు వర్గీయులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివానందం వివరించారు. తుమ్మల గణేశ్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం, భారతీయ ఆయుధ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. తల్వార్లు, కర్రలతో దాడులకు పాల్పడిన తూప్రాన్ పట్టణానికి చెందిన జగితీష్‌సింగ్ అలియాస్ జగదీశ్‌సింగ్, అమర్ జిత్‌సింగ్ అలియాస్ అమర్‌దీప్‌సింగ్, తుఫాన్‌సింగ్, గోవింద్‌సింగ్, బలరాం సింగ్ అలియాస్ రాంసింగ్, బల్‌జిత్‌సింగ్ అలియాస్ రాజిసింగ్‌ను అరెస్టు చేసినట్లు వివరించారు. అరెస్టు చేసిన ఏడుగురిని రిమాండ్‌కు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

గంజాయి తాగుతున్న ఐదుగురి అరెస్ట్

రామచంద్రాపురం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గంజాయి తాగుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసిన సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శశికాంత్‌రెడ్డి వివరాల ప్రకారం.. పాత రామచంద్రాపురంలోని జీహెచ్ఎంసీ కార్యాలయం సమీపంలో రామచంద్రాపురానికి చెందిన మనోజ్‌కుమార్, కృష్ణ, మహేష్‌కుమార్, సురేష్, హేమంత్ కుమార్ గంజాయి తాగుతున్నారని సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి సమయంలో దాడిచేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

అక్రమ కేసు పెట్టారంటూ సెల్ టవర్ ఎక్కిన రైతు


నిజాంపేటలో సెల్ టవర్ ఎక్కిన కౌలు రైతు

నిజాంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కౌలు డబ్బులు విషయంలో జరిగిన గొడవలో తనపై అక్రమ కేసు పెట్టారంటూ ఓ రైతు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చల్మెడ ప్రాంతానికి చెందిన బొమ్మ చిన్న నారాయణ రెండేళ్ల క్రితం నిజాంపేట మాజీ సర్పంచ్ శ్రీనివాస రెడ్డి పొలాన్ని కౌలుకు చేస్తున్నాడు. ధాన్యం పండించిన తర్వాత తూకం వేస్తే నగదు యజమాని ఖాతాలో జమ అయింది. తనకు రావాల్సిన డబ్బుల కోసం యజమానితో గొడవ పడ్డాడు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు తనపై అక్రమంగా కేసు పెట్టారని.. బాధితుడు సెల్ టవర్ ఎక్కాడు. తనకు న్యాయం చేయకపోతే దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. పోలీసులు వచ్చి.. న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో టవర్ దిగి వచ్చాడు.

అప్పుల బాధతో ఆత్మహత్య


కృష్ణ (ఫైల్)

కౌడిపల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) 16: చెల్లి పెళ్లి కోసం చేసిన అప్పులు తీరే మార్గం కనిపించక ఓ యువకుడు ఉరి వేసుకున్నాడు. ఈ ఘటన కౌడిపల్లిలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లె కృష్ణ తండ్రి భిక్షపతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో కుటుంబ బాధ్యతలు తీసుకున్న కృష్ణ చెల్లిలి వివాహం కోసం గ్రామంలో గతేడాది రూ. 3లక్షల వరకు అప్పు చేశాడు. తనకున్న మూడు ఎకరాల్లో వ్యవసాయం చేసేందుకు బోరు వేసినా నీరు రాలేదు. అప్పులు తీర్చే మార్గం కనిపించక.. బోరు ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసినా.. లిఫ్ట్ చేయకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా, అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..


వేణు(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన గౌరిశెట్టి వేణు(46)కు భార్య అలేఖ్య, ఇద్దరు పిల్లలున్నారు. వేణు పట్టణంలో షాపింగ్‌మాల్‌ను నిర్వహిస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ముందే అలేఖ్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. గత కొంతకాలంగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన వేణు గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి రైతు మృతి


కిష్టారెడ్డి(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో పడి రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో గురువారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాడ కిష్టారెడ్డి తమకున్న వ్యవసాయ పొలంలో వివిధ పంటలు సాగుచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పొలం సమీపంలోని కూడవెల్లి వాగులో కలిసే పిల్ల వాగులో వ్యవసాయ మోటారు పనిచేయకపోవడంతో బుధవారం మధ్యాహ్నం దానిని సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడికి చేరుకొని వాగులో గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. తిరిగి గురువారం మరోసారి వాగులో గాలింపు చేపట్టి కిష్టారెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..


నాగరాజు (ఫైల్)

హత్నూర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన హత్నూర మండలం మాధురలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నింగన్నగారి నాగరాజు (38) బుధవారం రాత్రి గ్రామ శివారులోని దామర చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి, వల వేసి వచ్చాడు. గురువారం తెల్లవారుజామున చెరువు వద్దకు వెళ్లి వలలో చేపలు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకొని నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు చూసి కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య నర్సమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమై.. బావిలో శవంగా..


వైష్ణవి(ఫైల్)

రాయికోడ్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాయికోడ్ మండల పరిధిలోని సంగాపూర్ గ్రామానికి చెందిన ఎం.సతీష్ కూతురు వైష్ణవి(11) ఈనెల 9న ఇంట్లో నుంచి వెళ్లి గురువారం గ్రామ శివారు బావిలో శవమై తేలింది. వైష్ణవి తల్లిదండ్రులు రెండు నెలల క్రితం గొడవ పడి విడిపోయారు. ఈ నెల 9న బాలిక కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా కనిపించ లేదు. గురువారం గ్రామ శివారులోని పాడుబడిన బావి వద్ద బాలిక దుస్తులు, చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి చూడగా, బాలిక మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. దీంతో గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. వైష్ణవి మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

బీదర్ దొంగల కోసం చెక్‌పోస్టులో నిఘా


జహీరాబాద్ బీదర్ చౌరస్తా వద్ద తనిఖీలు చేపడుతున్న పోలీసులు

జహీరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బీదర్‌లో దోపిడీ దొంగలు గురువారం ఏటీఎంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన బ్యాంకు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపి, ఒకరిని చంపేసిన పారిపోయిన ఘటనతో సరిహద్దు పోలీసులు అప్రమత్తం అయ్యాయరు. నిందితులు రాష్ట్రంలోకి వచ్చే అవకాశం ఉందని భావించిన జహీరాబాద్, హద్నూర్ పోలీసులు ముమ్మర వాహన తనికీలు చేపట్టారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జహీరాబాద్‌లోని బీదర్ చౌరస్తా, అల్లనా చౌరస్తాల్లో పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ వాహన తనిఖీలు చేపట్టారు. న్యాల్‌కల్ మండలం హుసెళ్లీ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద హద్నూర్ ఎస్‌ఐ రాజశేఖర్ వాహన తనిఖీలు చేపట్టారు.

మట్టి.. ఇసుక.. దేన్నీ వదలరు..

- జోరుగా అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు


ప్రభుత్వ భూమి నుంచి తరలించిన మట్టి

కొందరు అక్రమార్కులు ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. మట్టి.. ఇసుకను అక్రమంగా రవాణా చేసి రూ. కోట్లు కూడబెడుతున్నారు. చట్టాలను అపహాస్యం చేస్తూ.. అధికారుల కళ్లు కప్పి.. కొన్ని చోట్ల వారితో కుమ్మక్కై యథేచ్ఛగా తరలిస్తున్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో రాత్రి అయితే చాలు టిప్పర్ల కొద్ది మట్టి తరలిపోతోంది. ఓ నాయకుడి ఆధ్వర్యంలో అక్రమ రవాణా జరుగుతోంది. సిద్దిపేట జిల్లా కుక్కునూరుపల్లిలోనూ మట్టి దందా జోరుగా సాగుతోంది. ధూళిమిట్ట మండలంలో కొందరు ఇసుకాసురులుగా మారారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ వీరు దందా సాగిస్తున్నా.. అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేస్తూ.. ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తోడేస్తున్నారు..


బైరాన్‌పల్లి వాగులో ఏర్పడ్డ గుంతలు

ధూళిమిట్ట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాన్‌పల్లి, జాలపల్లి గ్రామాల్లో కొందరు వాగుల నుంచి ఇసుకను తోడేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రమే కురవడంతో వాగుల్లో నీరు తక్కువగా ఉంది. దీనిని అదనుగా తీసుకుని రాత్రి వేళ వాహనాల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు రాత్రి వేళ ఇసుకను తరలించి ఓ చోట డంప్ చేసి.. అవసరం అయిన వారికి విక్రయిస్తున్నారు. అప్పుడప్పుడు పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకుని ఇసుకను సీజ్ చేస్తున్నారు. అయితే, అలా సీజ్ చేసిన ఇసుకను బహిరంగ వేలంలో మళ్లీ దక్కించుకుంటున్న ఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయాన్ని తహసీల్దార్ మధుసూదన్ దృష్టికి తీసుకెళ్లగా.. గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు లేకపోవడం వల్ల ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచలేకపోతున్నామన్నారు. గ్రామస్థులు సమాచారం అందిస్తే ఇసుక రవాణాపై చర్యలు తీసుకుంటామన్నారు.

కాసులు కురిపిస్తున్న మట్టి



కుకునూరుపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని తరలించేందుకు తవ్విన కాలువలు కొందరు అక్రమార్కులకు కాసులు కురిపిస్తుయి. కాలువలు తవ్వే సమయంలో తీసిన మట్టిని నాడు ఇరువైపులా పోయగా, వాటిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా ముద్దాపూర్, తిప్పారం, మంగోల్ శివార్ల నుంచి రాత్రి వేళ భారీ వాహనాల్లో తరలిస్తూ మండలంతో పాటు ప్రజ్ఞాపూర్, గజ్వేల్, మండలాల్లో వెలుస్తున్న వెంచర్లకు సరఫరా చేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కి రూ. 5వేల నుండి 6వేల వరకు వసూలు చేస్తున్నారు. పలు వాహనాలకు నెంబర్ ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం. రెవెన్యూ పోలీసు, టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకొని జరిమానా విధించినప్పటికీ వారిలో ఎటువంటి భయం లేదు. అయితే, ఈ మట్టి మాఫియా వెనుక అధికార పార్టీకి చెందిన ఓ మండల స్థాయి నాయకుడు ఉన్నాడని, గతంలో అధికారులు మట్టి తరలిస్తున్న వాహనాలను పట్టుకోగా.. ఆయనే మధ్యవర్తిత్వం నెరపి జరిమానాలు లేకుండా చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

మట్టి దందాకు సిండికేట్

మనోహరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాత్రి అయిందంటే చాలు కొందరు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇందుకోసం ఓ నాయకుడు సిండికేట్‌ను సైతం ఏర్పాటు చేశాడు. అతని కనుసన్నల్లోనూ యథేశ్ఛగా మట్టి రవాణా జరుగుతోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఇది తమ పరిధి కాదంటూ దాటవేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మనోహరాబాద్ మండల కేంద్రంలో సుమారు 200 పైగా చిన్న పెద్ద పరిశ్రమలు ఉండటంతో ఎక్కడ పడితే అక్కడ మట్టి తవ్వి తరలిస్తున్నారు. రాత్రి వేళ గుట్టుగా సాగుతున్న ఈ దందాపై గ్రామస్థులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫోన్ చేయగా, వస్తున్నామంటూ తప్పించుకుంటున్నారు. డయల్ 100కు ఫోన్ చేస్తే.. మట్టి తరలింపుతో మాకు సంబంధం లేదని చెబుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇలా ఎవరికి వారు పట్టించుకోకపోవడంతో మండలంలో జోరుగా మట్టి అక్రమ రవాణా సాగుతోంది.

గతంలో ప్రత్యేక కమిటీ..

మండలంలో మట్టి దందాపై కలెక్టర్ ఆదేశాలతో గతంలో కమిటీ ఏర్పాటు చేశారు. ఇద్దరు ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవోలతో కమిటీని నియమించారు. రాత్రి వేళ మట్టి తరలిపోకుండా సూపర్‌వైజర్‌ను కూడా నియమించారు. అయినా, దందాకు మాత్రం అడ్డుకట్టపడలేదు.

నాయకుల సిండికేట్

మండలంలో అక్రమ మట్టి తరలింపునకు నాయకులు సిండికేట్‌గా మారినట్లు తెలుస్తోంది. గతం అధికారంలో ఉన్న పార్టీ నాయకుడు.. ఇప్పుడు ఈ దందా కోసమే ఇప్పటి అధికార పార్టీలోకి చేరినట్లు చెప్పుకుంటున్నారు. ఆయన ఆధ్వర్యంలో మట్టి రవాణా సిండికేట్ నడుస్తున్నట్లు చెబుతున్నారు. మండలంలో ఎక్కడికి మట్టి తరలించాలన్నా.. ఎంత రేటుకు విక్రయించాలనే విషయాన్ని ఆయనే డిసైడ్ చేస్తున్నట్లు సమాచారం. ఆయన అనుమతి లేకపోతే అధికారులకు ఫోన్లు చేసి మట్టి టిప్పర్లను పట్టిస్తున్నట్లు సమాచారం. మండలంలో 5 గ్రూపులను ఏర్పాటు చేసి.. ఈ దందా నడిపిస్తున్నట్లు సమాచారం.

నిరుపేదలకు సంక్షేమ పథకాలు

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరిచందన
- రైతు భరోసా సర్వే ప్రక్రియ పరిశీలన


రైతుభరోసా సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి హరిచందన, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి హరిచందన అన్నారు. కంది మండలంలోని చిమ్నాపూర్ గ్రామంలో ఆమె సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహర భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల విచారణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి సర్వే తీరును పరిశీలిస్తూ ఆయా ఇళ్లలోని సభ్యులతో మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది ఉంటారు? జీవనం ఎలా సాగిస్తారు పొలం ఎంత ఉన్నది? అందులో సాగులో ఎంత? వంటి వివరాలను పరిశీలించారు. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భూములను క్షేత్రస్థాయిలో గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు పథకాల అమలులో జిల్లా యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. నిజమైన అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 20లోగా అన్ని గ్రామల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రవిందర్ రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపివో మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాభాలకు ఆశపడి.. యాప్‌లో పెట్టుబడి

నిండా మునిగిన జనం



గజ్వేల్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఎస్ఓ యాప్‌లో పెట్టుబడులు పెట్టి దాదాపు వందలాది మంది యువకులు దారుణంగా మోసపోయారు. వివరాల్లోకి వెళితే.. కొడకండ్ల గ్రామానికి చెందిన దాదాపు 70 మంది అధిక వడ్డీలకు ఆశపడి ఒకరి ద్వారా మరొకరు యాప్‌లో రూ. 500నుంచి రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. రూ. 6 వేలు పెట్టుబడి పెడితే రోజుకు రూ. 1,200 జమ చేస్తామని, రూ. 9 వేలు పెట్టుబడి పెడితే, రూ. 1,600 జమచేస్తామని నమ్మించడంతోపాటు కొన్ని రోజుల పాటు ఈ మేరకు జమ చేశారు. తర్వాత డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయామని బాధితులు గగ్గోలు పెడుతున్నారు.


భూముల సర్వే నంబర్లు చూస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

పంట సాగు అవుతోందా.. సొంత ఇల్లు ఉందా..

రామయంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మీకు ఇల్లు.. పొలం ఉందా.. ఉంటే ఆ భూమిని సాగు చేస్తున్నారా.. లేక ఊరికే వదిలేశారా.. అంటూ మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ రైతులను అడిగి తెలుసుకున్నారు. గురువారం ఆయన రామాయంపేట మండల పరిధి క్కాట్రియాల, కోమటిపల్లిలో చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సర్వే నెంబర్లలో వ్యవసాయ భూములుగా చూపుతున్నా.. అక్కడ ఇళ్లు.. వెంచర్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో విస్తుపోయిన కలెక్టర్.. దీనిపై సంబంధిత అధికారులను విచారణ ప్రక్రియపై ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని గ్రామాల్లోనూ సర్వే చేపట్టాలన్నారు.

నవోదయ ప్రవేశపరీక్షకు 30 కేంద్రాలు

వర్గల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం 2024-2026 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశానికి గాను రేపు నిర్వహించే ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తయినట్లు ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. విద్యాలయంలో 6వ తరగతి 80 సీట్లకుగాను ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 6,465 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నారు. సిద్దిపేట జిల్లా నుంచి 2,250, మెదక్ జిల్లా నుంచి 1,589, సంగారెడ్డి జిల్లా నుంచి 2,626 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సిద్దిపేట జిల్లాలో 10, మెదక్ జిల్లాలో 8, సంగారెడ్డి జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే కేంద్రాలలో 30 మంది పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, 30 మంది కేంద్ర పరిశీలకులు, ఇతర అధికారులను నియమించినట్లు తెలిపారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతందని, విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ శ్రీనివాస్‌రావు 73823 35164, ఎంజీ సోని 94489 01318, ప్రిన్సిపాల్ రాజేందర్ 99215 55310 సంప్రదించాలని సూచించారు.

రేషన్ కార్డుల లొల్లి....


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

నంగునూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా రేషన్‌కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా.. తమ పేర్లు రాకపోవడం ఏమిటని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. పలు పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం గురువారం మండలంలోని పాలమాకుల, గట్లమల్యాల, సంతోష్‌నగర్, కోనాయిపల్లి గ్రామాలకు అధికారులు వచ్చిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పాలమాకులలో తహసీల్దార్ సరిత అధికారులతో కలిసి సర్వే చేస్తుండగా, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా తమ పేర్లు జాబితాలో ఎందుకు లేవని గ్రామస్థులు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు నుంచి వచ్చిన జాబితా ప్రకారం సర్వే చేస్తున్నామని తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. గ్రామంలో సుమారుగా తొమ్మిది వందల మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నామని పూర్తి జాబితా వచ్చేంత వరకు సర్వే చేయవద్దని ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చి, వారి సహకారంతో సర్వే చేపట్టారు. గ్రామస్థుల వినతి మేరకు తహసీల్దార్ సరిత కలెక్టర్, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. వారి సూచన మేరకు గ్రామస్తుల నుంచి స్వీకరించారు. నంగునూరు, కోనాయిపల్లి గ్రామాల్లోనూ తమ పేర్లు లేవని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఒగ్గుల పూజలు.. జగ్గుల మోతలు

5వ పేజీ తరువాయి


కొమురవెల్లి రాజగోపురం ఎదుట వీరకోలలతో జోగినుల చిందులు(ఫైల్)

జాతర కొనసాగుతూ వస్తుంది. గతంలో కేవలం మూడు నెలలే ఆలయం తెరిచి ఉండగా, మిగతా రోజుల్లో మూసివేసి ఉండేదని పెద్దలు చెబుతుంటారు. కానీ కాలక్రమేణా మరింత ప్రాచుర్యంలోకి వస్తుండంతో సాధారణ రోజులల్లోనూ భక్తులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. ఇలా ప్రతీ ఆదివారమూ జాతర కొనసాగుతున్నందున మల్లన్న భక్తులకు ఆదివారం ప్రత్యేకంగా నిలుస్తోంది.

పుట్టమన్ను విగ్రహం.. శివుడి ప్రతిరూపం

18వ శతాబ్దంలో కొమురవెల్లిలోని విజయాచల గుట్టల్లో ఓ ముని తపస్సు చేయగా, శివలింగం వెలిసింది. ఆ లింగంపై పెరిగిన పుట్టమన్నుతో మూలవిరాట్టును రూపొందించి స్వామి వారి నాభిలో ఆ శివలింగాన్ని ప్రతిష్ఠించారని ప్రచారంలో ఉంది. శివపురాణంలో పరమశివుడు త్రిపురాసురులను సంహరించిన మాదిరిగా మల్లన్న పాదాలకింద ముగ్గురు రాక్షసుల తలలున్నందున స్వామివారిని పరమశివుడుకి ప్రతిరూపంగా కొలుస్తున్నారు. మరో గ్రామీణచరిత్ర ప్రకారం.. గ్రామానికి చెందిన నీలమాంబ, ఆదిరెడ్డి ఆరోసంతానంగా జన్మించిన మల్లికార్జునుడు పరమశివ భక్తుడిగా అనుగ్రహం పొంది దైవంగా వెలుగొందుతున్నాడని ప్రచారంలో ఉంది. కాగా దశాబ్దాల క్రితం లభ్యమైన హర్యామాయిన్ చిక్కాల ఆధారంగా పరమశివుని అంశతో మల్లన్న వెలిశాడని వీరశైవ పెద్దలు చెబుతున్నారు. సాధారణంగా ఆలయాల్లో దేవతామూర్తుల చూపు తూర్పుదిశవైపు ఉంటుంది. కానీ మల్లన్న ఆలయంలో మాత్రం స్వామి వారి మూలవిరాట్టు పడమరవైపు చూస్తారు. దీంతో పడమటి శివాలయంగా పేరొంది ప్రత్యేకతను చాటుకుంటుంది. ఏ ఆలయమైనా ఒకే సంప్రదాయం ప్రకారంగా పూజాది కార్యక్రమాలు జరుగుతాయి. కానీ కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రెండు సంప్రదాయాలు కనిపిస్తాయి. మల్లన్నస్వామి వీరశైవులకు చెందిన మేడలాదేవీని వివాహమాడిన క్రమంలో వీరశైవాగమశాస్త్రం ప్రకారం వీరశైవార్చకులు గర్భాలయంలో వేదమంత్రోచ్ఛారణలతో ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. అలాగే యాదవుల ఆడబిడ్డ అయిన కేతలాదేవీని వివాహమాడినందున యాదవులు పంచరంగులతో పట్నాలు వేసి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు బోనం నివేదించి, పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఆనవాయితీగా విజయాచలగుట్టపై మల్లన్న సహోదరి అయిన ఎల్లమ్మతల్లికి బోనం నివేదించి కల్లును శాకపోసి ఒడిబియ్యాలు సమర్పిస్తారు.

మల్లన్న హుండీ లెక్కింపు

33 రోజుల్లో భారీగా ఆదాయం.. ఐదేళ్లుగా ముల్లెకట్టిన వాటిపై అనుమానాలు


ఐదేళ్లుగా హుండీలోనే నిల్వచేసిన బంగారు మొక్కు బడుల సంచి

చేర్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో గురువారం కానుకలు, ఒడిబియ్యం హుండీ లెక్కింపులు చేపట్టారు. ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో దేవాదాయశాఖ మెదక్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలోఆలయ ముఖమండపంలో శివరామకృష్ణ భజనమండలి సేవాసమితి సభ్యులు లెక్కింపులు జరిపారు. ఈసందర్భంగా రూ.73,14,488 నగదు, 134గ్రాముల మిశ్రమ బంగారం, 9.300కిలోల మిశ్రమ వెండి, 26 విదేశీ కరెన్సీ నోట్లు, 10 క్వింటాళ్ల మిశ్రమ బియ్యం లభ్యమయ్యాయి. గత డిసెంబర్‌లో స్వామి వారి కల్యాణంకు ముందే హుండీ లెక్కింపులు చేపట్టినప్పటికీ 33 రోజులలో ఈ ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, ధర్మకర్తలు, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా సంచిలోనే..

మహామండపంలోని ఓ ప్రధాన హుండీలో ఐదేళ్లుగా ఓ సంచిలో దాచిపెట్టిన బంగారం, వెండి గురువారం గుర్తించడం కలకలం రేపింది. 2020లో ఆ సంచిని హుండీలో ఎవరుపెట్టారు. ఎందుకు దాచారన్న విషయంపై అనుమానాలు రేకెత్తాయి. అప్పటినుంచి ఎన్నోసార్లు హుండీ లెక్కింపులు చేపట్టినప్పటికీ సుమారు 5 గ్రాముల మిశ్రమ బంగారం, సుమారు 4.50కిలోల వెండి మొక్కుబడులున్న సంచిని గుర్తించకపోవడంపై సందేహాలు తలెత్తుతున్నాయి. ఈవో రామాంజనేయులును వివరణ కోరగా, ఐదేళ్ల హుండీలెక్కింపుల రికార్డులు పరిశీలించామని, కానీ హుండీలో అంత సొమ్ము ఎందుకు దాచిపెట్టారన్న విషయపై విచారణ చేస్తామన్నారు.

ఘనంగా తెప్పోత్సవం

మిరుదొడ్డి, జనవరి16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో గురువారం సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద చెరువులో తెప్పోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితుడు రాజగోపాలచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో రాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు స్వామి వారికి మంగళహారలతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ, సభ్యులు రాజు, అంజిరెడ్డి, రాజేశం, అంజయ్య, వెంకటయ్య, బిక్షపతి, విరేశంగౌడ్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

దుబ్బాక, జనవరి16(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెళ్లి రామలింగేశ్వరాలయ గురువారం హుండీ లెక్కించారు. దేవాదయ శాఖ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మొత్తం రూ.1,27,174 హుండీ ఆదాయం లభించింది.

36 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల నుంచి చేపట్టిన డ్రెంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 36 మందిని గురువారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరిచారు. విచారణ చేపట్టిన ఆయన 36 మందికి రూ.84,500 జరిమానా విధించారు. అందులోనే ఒకరికి 5 రోజులు, మరొకరికి 3 రోజుల జైలు శిక్ష విధించారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

తొగుట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి మండిపడ్డారు. గురువారం తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రెండు పంటలకే రైతు బంధు ఇచ్చారని, అప్పట్లో 3 పంటలకు ఇవ్వాలని మాట్లాడిన రేవంత్‌రెడ్డి నేడు మొత్తానికే మంగళం పాడారని విమర్శించారు. వెంటనే రైతు పథకాలన్నీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయయులు స్వామి, వెంకటయ్య, పరశురాములు, బాలేశ్, రమేశ్, గణేష్, యాదగౌడ్, జహంగీర్, శివ, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'

సిద్దిపేట క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి అన్నారు. గురువారం ఆమె సిద్దిపేటలోని లార్డు నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రాన్ని సందర్శించి లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. అలాగే కేరింగ్ హాండ్స్ ట్రస్ట్ వారి సహకారంతో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ సర్వీస్ ఫర్ సీనియర్ సిటిజన్స్ స్కీం -2016 గురించి తెలియజేశారు. ఆస్తి ఉండి పిల్లల ఆదరణ లేక నిరాశ్రయులైన వారి పిల్లలపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఎటువంటి సమస్యలున్నా జిల్లా న్యాయాధికారిక సంస్థను సంప్రదించాలని సూచించారు.

'వార్డు సభల్లో ప్రజలందరూ పాల్గొనేలా చూడాలి'

హుస్నాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే వార్డు సభల్లో ప్రజలందరూ పాల్గొనేలా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కౌన్సిలర్లను కోరారు. గురువారం ఆమె మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. వార్డు సభల్లో కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు ఆఫీసర్ల సమక్షంలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతందన్నారు. జాబితాలో లేని వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, బోజు రమాదేవి, కోమటి స్వర్ణలత, పెరుక భాగ్యరెడ్డి, చిత్తారి పద్మ, గోవిందు రవి, దొడ్డి శ్రీనివాస్, భూక్య సరోజన, జనగామ రత్న, వల్లపు రాజు, వాల సుప్రజ అయిలేని శంకర్ రెడ్డి, ఎండి అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గజ్వేల్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్ గ్రామంలో నాగమణి అనే మహిళ కొన్ని రోజుల క్రితం మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో మనం ఫౌండేషన్ తరపున గురువారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గొడుగు స్వామి, ప్రధాన కార్యదర్శి కనకయ్య, కోశాధికారి ఆంజనేయులు, సభ్యులు కొండల్‌రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు. అలాగే ఎసీఎఫ్ గజ్వేల్ వారు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం, 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేవారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

ములుగు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక గురువారం గజ్వేల్ నియోజకవర్గ బాధ్యులుపైన రాములు సమక్షంలో నిర్వహించారు. అధ్యక్షునిగా ఆదాస్ మహేష్, ఉపాధ్యక్షులుగా మల్లేష్, భాస్కర్, మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా ఆశగల్ల సురేష్, అధికార ప్రతినిధిగా మల్లేష్, కార్యదర్శిగా రమాకాంత్, వినోద్‌కుమార్ ఎన్నికయ్యారు.

● మర్కుక్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడుపైన రాములు మర్కుక్ మండల మాదిగ జేఏసీ కన్వీనర్ మొండి భిక్షపతి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలును ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు.

సాగు భూములకే రైతు భరోసా



గజ్వేల్ మండలంలో సర్వే నిర్వహిస్తున్న ఏవో నాగరాజు

● భూముల గుర్తింపు సర్వేలో నిమగ్నమైన అధికారులు

గజ్వేల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సాగు భూములకే రైతు భరోసాను అందిస్తామని గజ్వేల్ మండల వ్యవసాయాధికారి గుండు నాగరాజు అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని జాలిగామ, దాచారం, సింగాటం, శేరిపల్లి గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయాధికారులతో కలసి వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు కృష్ణ, మోతే హరీశ్, సంతోష్, ఏఈవోలు పాల్గొన్నారు.

● జగదేవ్‌పూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజపేట, కొండాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించి భూములను పరిశీలించారు. జగదేవ్‌పూర్ తహసీల్దార్ కృష్ణమోహన్, వ్యవసాయ అధికారి వసంతరావు సాగులో లేని భూములను గుర్తించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, ఏవో కవిత ఉన్నారు.

● దుబ్బాక/మిరుదొడ్డి, జనవరి16 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో రైతు భరోసా తదితర పథకాల సర్వే చేపట్టారు. తహసీల్దారుల్లు సంజీవ్‌కుమార్, హరికిషన్, చంద్రశేఖర్, ఎంపీడీవోలు భాస్కరశర్మ, గణేష్‌రెడ్డిలు హాజరై సర్వేను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ఏవో మల్లేశం, సీనియర్ అసిస్టెంట్ కొండల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తులసి, రవి పాల్గొన్నారు



ధర్మారంలో రైతుభరోసా సర్వే..

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్‌కుమార్



గజ్వేల్ బస్తీ దావఖానను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

గజ్వేల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిద్దిపేట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్‌కుమార్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని పాత బస్తీ, ఆర్అండ్ఆర్ కాలనీలోని బస్తీ దవాఖానాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌లో నిర్వహిస్తున్న రక్త పరీక్షల నమునాలను, రికార్డులను పరిశీలించారు. అక్కడి నుంచి ఫార్మసి స్టోర్‌ను సందర్శించి మందులను తనిఖీ చేశారు. ఓపీ, స్టాక్ అండ్ ఇష్యూ రిజిస్ట్రర్‌లను స్వయంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన ప్రజలను ప్రేమతో ఆహ్వానించాలని, ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని, దగ్గు, జలుబు, తలనొప్పి, జ్వరం, శ్వాస సంబంధమైన సమస్యలను గుర్తించినట్లయితే వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ఆయనవెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్, సీహెచ్‌ఓ రవిందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కొండపోచమ్మ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసిపి పురుషోత్తంరెడ్డి.

కొండపోచమ్మ జాతరకు భారీ బందోబస్తు

● ఏర్పాట్లను పరిశీలించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

● వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందికి సూచనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జగదేవ్‌పూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ అమ్మవారి జాతరకు బారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి కొండపోచమ్మ జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 14న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ముంచుకొస్తున్న జాతర.. కనిపించని ఏర్పాట్లు' అనే శీర్షికను ప్రచురితమైన కథనానికి స్పందించారు. కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ దేవాలయానికి వచ్చే మార్గంలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఏసీపీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ కొండపోచమ్మ జాతర నేపథ్యంలో భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ మహేందర్ రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్సై చంద్రమోహన్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కనకయ్య, హరిబాబు ఉన్నారు.

భూనిర్వాసితులకు ఆత్మీయ భరోసా అందించాలి

గజ్వేల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు ఆత్మీయ భరోసాను అందించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. భూనిర్వాసితులతో కలసి గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించిన అనంతరం గజ్వేల్ ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయనవెంట డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు ఉన్నారు.



పోలీసుల అవగాహన

సిద్దిపేట రూరల్ : అవగహన కల్పిస్తున్న పోలీసులు

న్యూస్ నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా పోలీసులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు.

జంగిటి లచ్చవ్వ మృతి బాధాకరం : అందెశ్రీ



ధూళిమిట్ట,జనవరి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు, నిజాం రజాకార్ల ఆగడాలకు ఎదురొడ్డి నిలిచిన ధీర వనిత జంగిటి లచ్చవ్వ ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను గురువారం ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, మనోజ్ తదితరులు ఉన్నారు.

యువ అవధానికి సేవా పురస్కారం



భానుప్రకాష్

కొండపాక,జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక ధార్మిక సాహిత్య సేవా రంగాలలో విశిష్టమైన సేవలు అందించిన ప్రముఖులకు ఏటా అందించే విజయ దుర్గా ధార్మిక సేవా పురస్కారం-2025కు మెదక్ జిల్లా బూరుగుపల్లి గ్రామానికి చెందిన యువ అవధాని, సాహితీవేత్త వ్యక్తిత్వ వికాస శిక్షణా నిపుణుడు అవుసుల భానుప్రకాష్‌కు ఎంపికైనట్లు విజయ దుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు చెప్పెల హరినాథశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న మర్పడగ శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో జరిగే పీఠాధిపతులు వెదురుపాక గాడ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దిపేట రూరల్,జనవరి16(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ శివారులోని పిట్టలగుడిసెల వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన గ్యాదరి రాజశేఖర్(38) రాఘవాపూర్‌లో గురువారం జరిగిన బంధువు దశదిన కర్మకు వెళ్లి తిరిగి బైక్‌పై సిద్దిపేటకు బయలుదేరాడు. గ్రామ శివారులోకి రాగానే కారు, బైక్ ఢీకొన్నాయి. దీంతో రాజశేఖర్‌కు తీవ్ర గాయలుకాగా 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

సబ్‌స్టేషన్‌లో ఇనుపరాడ్ల చోరీ

గజ్వేల్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అక్కారం శివారు కోనాపూర్ వద్దనున్న సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌శాఖకు సంబంధించిన 9 ఇనుపరాడ్లను బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆ శాఖ అధికారులు గురువారం గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చిన్నకోడూరు, జనవరి (ఆంధ్రజ్యోతి) 16 : మండలం పరిధి మాచాపూర్‌లో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కథనం ప్రకారం ఓ ఇంట్లో కొంత మంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో గురువారం రాత్రి సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 5,470, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

హుస్నాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన బసవరాజు వీరవ్వ (62) గురువారం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. చెవిటి సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీఆనంద్

సిద్దిపేట టౌన్, జనవరి16(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని 37వార్డు కౌన్సిలర్ సాకిబాల్ లక్ష్మీఆనంద్ తెలిపారు. ప్రభుత్వం పలు పథకాలకు శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రేషన్‌కార్డుల ప్రక్రియ ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ రియాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు దాసరి నర్సింలు, సాకి శ్రీనివాస్, మల్లేశం, సాకి రఘు, బయ్యారం యాదగిరి, సాకి అశోక్, ఏనుగుల నటరాజ్, తండ నవీన్, బత్తుల పరశురామ్, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు బడి బయటి పిల్లల గుర్తింపు



వడ్డెపల్లిలో బడి బయటి పిల్లల వివరాలు సేకరిస్తున్న సీఆర్పీ యాదగిరి

రాయపోల్ /వర్గల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డెపల్లిలో ఇద్దరు బడి బయటి పిల్లల్ని గుర్తించినట్లు సీఆర్పీ యాదగిరి తెలిపారు. ఈ ఇద్దరు హాస్టల్‌లో జాయిన్ అయి బడి మానేసినట్లు పేర్కొన్నారు. వీరిని త్వరలోనే పాఠశాలలో చేర్పించనున్నట్లు తెలిపారు. అలాగే వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో ముగ్గురు బడి పిల్లలను గుర్తించినట్లు సీఆర్పీ యాదగిరి తెలిపారు. వారు మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం నుంచి ఇక్కడకు వలస వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి : ఎంపీ



ఎంపీ రఘునందన్‌రావును కలిసిన నాయకులు

గజ్వేల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని గజ్వేల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన మనోహర్‌యాదవ్ గజ్వేల్ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఆయా మండలాల అధ్యక్షులు అనుములు సంపత్‌రెడ్డి, నీల సత్యం, జానకిరామ్ గౌడ్, బక్క వెంకటేష్‌లు గురువారం ఎంపీ రఘునందన్‌రావును కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ నూతన అధ్యక్షులను శాలువాతో సత్కరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని ఎంపీ వారికి సూచించారు.

యువత సమాజహితానికి పాటుపడాలి

● జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



విజేతలకు బహుమతుల అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : యువత సన్మార్గంలో పయనిస్తూ సమాజ హితానికి పాటుపడాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో కొమ్మూరి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ రాజు, మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి తదితరులు పాల్గొన్నారు.

● మద్దూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాగిళ్లాపూర్‌లో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం ప్రారంభించారు. ఏఎస్ఐ విజయ్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

జగదేవ్‌పూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన దోమ పోచయ్య మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ రాష్ట్ర నాయకులు పెద్ద యాదగిరి, రాజు, పెరిక సునిత, లావణ్య, అరుణ, లలిత తదితరులు ఉన్నారు.



హుస్నాబాద్‌లో బలగం వేణు

హుస్నాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో గురువారం బలగం సినిమా డైరెక్టర్ వెల్దండి వేణు సందడి చేశారు. సంక్రాంతి పండుగకు తన తోడల్లుడైన బింగి శ్రీనివాస్ ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అనంతరం మండలంలోని మహాసముద్రం గండి వద్ద ఇరు కుటుంబ సభ్యులు సరదాగా గడిపారు. వేణును చూసేందుకు పలువురు ఆసక్తి కనబర్చారు. ఫిబ్రవరిలో ఎల్లమ్మ సినిమా ప్రారంభించనున్నట్లు వేణు ఈ సందర్భంగా వెల్లడించారు.

వడపోత

(5వ పేజీ తరువాయి)

ఉండగా 5.50 లక్షల ఎకరాల్లోనే సాగుభూమి ఉంది. ఈ లెక్కన రెండు జిల్లాల్లో దాదాపు 2 లక్షల ఎకరాల భూమిని రైతుబంధు జాబితా నుండి తొలగించాల్సి ఉంది.

రేషన్‌కార్డుల జాబితాపై గందరగోళం

సిద్దిపేట జిల్లాలో 18,213 కొత్త కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలన దరఖాస్తులతోపాటు సమగ్ర సర్వే ప్రకారం గుర్తించిన వివరాల ఆధారంగా ఈ కొత్త రేషన్‌కార్డుల జాబితాను విడుదల చేసినట్లు చెబుతున్నారు. దీని ప్రకారమే అధికారులు సర్వే చేస్తున్నారు. అయితే చాలామంది పేర్లు జాబితాలో కానరావడం లేదు. తాము ప్రజాపాలన దరఖాస్తుల సమయంలోనూ, మీసేవలోనూ, సమగ్ర సర్వేలోనూ రేషన్ కార్డు కోసం అడిగామంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారుల చేతుల్లో ఉన్న జాబితాలో పేర్లు లేకపోవడంపై ఆగ్రహిస్తున్నారు. అయితే కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పుడు దరఖాస్తు చేస్తే కొత్త కార్డులు ఇంకెప్పుడు వస్తాయోనని మండిపడుతున్నారు. అన్ని సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డులనే అనుసంధానం చేయడంతో కొత్తకార్డులపై ఆశలు పెట్టుకున్నారు.

గ్రామసభల్లోనే అర్హులు ఫైనల్

ఈనెల 21 నుంచి నిర్వహించే గ్రామసభల్లోనే తుదిజాబితాలను ప్రకటించనున్నారు. రైతులకు అందించే రైతు భరోసా సహాయంపై ప్రస్తుత సర్వే ద్వారా ఒక అంచనాకు రానున్నారు. కొత్త రేషన్‌కార్డులపైనా తుది విచారణ పూర్తి కాబోతున్నది. ఏటా రూ.12 వేలు అందించడానికి వ్యవసాయ కూలీల జాబితాపైనా కసరత్తు జరుగుతోంది. ఉపాధిహామీ కార్డుల ద్వారా ఈ జాబితాను సిద్ధం చేయనున్నారు. ఇక ఇందిరమ్మ ఇళ్లకూ తీవ్రమైన పోటీ నెలకొన్నది. దీంతో ఇళ్లు ఎవరెవరికి ఉన్నాయో.. ఎవరెవరికి లేవు అన్న విషయాలపైనా క్షేత్రస్థాయి సర్వే చేస్తున్నారు. ఈ విషయాలపై మరింత క్లారిటీ రావాలంటే గ్రామసభల ద్వారానే సాధ్యమవుతుందని ప్రభుత్వం భావించింది. గ్రామసభల్లో అధికారులు, స్థానికుల సమక్షంలోనే అర్హులను ఎంపిక చేసేలా చర్యలు చేపట్టారు.



తొగుట తహసీల్దార్ కార్యాలయంలో భూముల వివరాలను నమోదు..